క్లుప్తంగా

స్పెషల్ జ్యుడీషియల్ జడ్జిగా తోట శ్రీనివాసులు



గిద్దలూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణ్ రావు ఉత్తర్వుల మేరకు గిద్దలూరు కోర్టులో నూతన స్పెషల్ జ్యుడీషియల్ జడ్జిగా తోట శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దర్శి కోర్టులో జ్యుడీషియల్ జడ్జిగా విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఆయనను పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ప్రజల్లో మంచి పేరు తీసుకురావాలి

తాళ్లూరు: మండల సచివాలయ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు బాధ్యతగా పనిచేసి ప్రజల్లో వైఎస్సార్ సీపీకి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ కోరారు. నూతనంగా ఎంపికైన మండల సచివాయ కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి, గ్రామ కన్వీనర్లు ఎమ్మెల్యేను కలిసి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ఎంఎన్పీ నాగార్జునరెడ్డి, సొసైటీ చైర్మన్ శనివారపు శ్రీనివాసరెడ్డిలను ఘనంగా సన్మానించారు. సర్పంచిలు వలి, పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి, ఉప సర్పంచి కాశిరెడ్డి, మాజీ సర్పంచి టీవీ సుబ్బారెడ్డి, వికాస్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు నిలిపేయాలి

దర్శి: డీఎస్పీ కార్యాలయం ఎదుట చర్చి స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు వెంటనే నిలిపేయాలని సామాజిక ఉద్యమ నాయకుడు గాలిమూటి దేవప్రసాద్, చర్మ డప్పు కళాకారుల సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కవలకుంట్ల గోవింద్ ప్రసాద్‌లు రెవెన్యూ కార్యాలయంలో సూపరింటెండెంట్ నరసింహారావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. అక్రమ కట్టడాన్ని నిలిపివేయక పోతే రిలే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు.

ఆక్రమణల తొలగింపు

గిద్దలూరు రూరల్.. మండలంలోని పొదలకుంటపల్లె గ్రామంలో జగనన్న లే అవుట్లకు వెళ్లే దారికి అడ్డంగా అక్రమంగా నిర్మించిన మూడు రేకుల షెడ్లను స్థానిక తహసీల్దార్ ఎం.రాజారమేష్‌ప్రేమ్‌కుమార్, ఎంపీడీవో ఆకుల రంగనాయకులు వారి సిబ్బందితో సోమవారం తొలగించారు.

సీఎంకు ధన్యవాదాలు

మార్కాపురం: రాష్ట్ర వాల్మీకి, బోయ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవీకాలం మరో రెండేళ్లు పొడిగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య చెప్పారు. తనకు పదవి కోసం కృషి చేసిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని సోమవారం ఆయన నివాసంలో సన్మానించారు. వాల్మీకుల అభ్యున్నతికి కృషి చేస్తానని కొండయ్య తెలిపారు. ప్రముఖ న్యాయవాది, వాల్మీకి సంఘ నాయకులు భూపని కాశయ్య, సర్పంచ్ బోగెం లక్ష్మయ్య, ఉప సర్పంచ్ నాద గురుబ్రహ్మం పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి రూ.55 వేల విరాళం

బేస్తవారిపేట: స్థానిక త్రిలోక పుణ్యక్షేత్రంలో గోశాల నిర్మాణానికి రావుల సులేచనమ్మ జ్ఞాపకార్థం రూ.55 వేల విరాళాన్ని సోమవారం అందజేశారు. సులేచనమ్మ కుమార్తెలైన బేస్తవారిపేట జెడ్పీ బాలికల హైస్కూల్ ఉపాధ్యాయిని వసంతలక్ష్మి, అరుణ, వనజ, కోడలు యామిని నగదును నిర్వాహకులు నర్రా బసిరెడ్డి, మాజీ ఎంపీపీ పీ వెంకటరాజు, చిరంజీవిరెడ్డికి అందజేశారు. గోశాల నిర్మాణంలో దాతలు పాలుపంచుకోవాలని నిర్వాహకులు కోరారు. గోశాల నిర్మాణానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఐ దీపిక బాధ్యతల స్వీకరణ

కొనకనమిట్ల: ఎస్ఐగా కె.దీపిక సోమవారం బాధ్యతలు చేపట్టారు. దీపిక ఒంగోలు దిశ పోలీసుస్టేషన్‌లో పని చేస్తూ బదిలీపై ఎస్ఐగా విధుల్లో చేరారు. ఎస్ఐ దీపిక మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలు రక్షించేందుకు కృషి చేస్తానన్నారు. ఇప్పటి వరకు ఎస్ఐగా పని చేసిన ఫణిభూషణ్ ఒంగోలు వీఆర్‌కు వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ దీపికను ఏఎస్ఐ హసన్, పోలీసుస్టేషన్ సిబ్బందితో పాటు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పూల మాలలు వేసి ప్రత్యేకంగా అభినందించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపుపై హర్షం

యర్రగొండపాలెం: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను మరో పదేళ్లు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, మండల కోఆప్షన్ సభ్యుడు కె.విజయకుమార్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ మాత ఆత్మార్పణ దినం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కేపీ



సన్మానం అందుకుంటున్న ఎమ్మెల్యే అన్నా



త్రిపురాంతకంలో వాసవీ మాత గ్రామోత్సవానికి హాజరైన భక్తులు

- హాజరైన ఎమ్మెల్యేలు కేపీ, అన్నా, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె

మార్కాపురం టౌన్: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని సోమవారం పట్టణంలోని అమ్మవారి శాలలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, సహస్త్రనామార్చన, సామూహిక లలితా సహస్తనామ పారాయణం చేశారు. మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ కార్యదర్శి ఎస్‌వీ సుబ్బారావు, కోశాధికారి రామడుగు రమేష్‌లు వారిని సన్మానించారు. కమిటీ ప్రతినిధి కేవీ రాఘవేంద్ర పాల్గొన్నారు.

తర్లుపాడు: మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జగన్‌బాబు ఆధ్వర్యంలో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం పట్టాభిరామస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు వాసవీక్లబ్ అధ్యక్షురాలు పి.కృష్ణకుమారి బహుమతులు అందజేశారు.

తాళ్లూరు: తూర్పుగంగవరం, తాళ్లూరు కన్యకాపరమేశ్వరి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో 102 మంది ముత్తైదువులతో సామూహిక కుంకుమార్చన, లలిత సహస్ర నామాల పఠనం, హోమం, పూర్ణాహుతి, మహామంగళహారతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా వాసవీ మాత గ్రామోత్సవం

త్రిపురాంతకం: వాసవీ మాత ఆత్మార్పణ దినం సందర్భంగా త్రిపురాంతకంలో అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక వాసవీ మాత ఆలయంలో మహిళలు కుంకుమ పూజ, అభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త

- మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: తెలుగు సమాజాన్ని చైతన్య పరిచిన యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త, దార్శనీకుడని, ఆయన చెప్పిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగారన్జునరెడ్డి అన్నారు. సోమవారం పొదిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యా శాఖ, ఉపాధ్యాయులు, మేధావుల అధ్వర్యంలో జరిగిన యోగి వేమన జయంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత వేమన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగి వేమన తెలుగు జాతికి, తెలుగు భాషకు ఎనలేని సేవ చేశారని కొనియాడారు. వేమన జయంతి సందర్భంగా మండల స్థాయిలో పద్య పఠన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమోంటోలు ప్రదానం చేశారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించి వేమన శతకం పుస్తకాన్ని బహూకరించారు. ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు వైఎస్సార్ సీపీ నాయకులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, పులిగోర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా ఉంటాం..!

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి స్పష్టం చేసిన మహిళలు
- పొదిలిలో మూడో రోజు కొనసాగిన గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధుడి యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరకాలం సీఎంగా ఉండేలా చూసుకుంటామని పలువురు మహిళా లబ్ధిదారులు మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం పొదిలి పట్టణం సచివాలయం-1 పరిధి 2వ వార్డు లక్కిశెట్టిపాలెం, పోలేరమ్మ గుడి ఏరియా, శ్రావణి ఎస్టేట్, ఎస్టీ కాలనీల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వచ్చిన అధికారులు, నాయకులకు స్థానికులు పూలతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెలే గడప గడపకు వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి సంక్షేమ పథకాల అమలు తీరు అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కో కుటుంబానికి ఏ మేర లబ్ధి చేకూరిందో ఆధారాలతో వివరించి బుక్‌లెట్ అందజేశారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగడంతో పాటు భవిష్యత్తులో మరింత మంచి జరగాలంటే 2024 ఎన్నికల్లోనూ సీఎంగా వైఎస్ జగన్‌ను ఆశీర్వదించి రుణం తీర్చుకుందామని పిలుపునిచ్చారు. నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, క్లాస్-1 కాంట్రాక్టర్ కల్లం సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ కె.నరసింహారావు, రాష్ట్ర వాణిజ్య కార్యదర్శి యక్కలి శేషగిరిరావు, గూడూరి వినోద్, నగర పంచాయతీ బీసీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు పులిగోర్ల శ్రీనివాసులు, మల్లాపురం నరసింహులు, జూపల్లి ఏడుకొండలు, కొత్తూరు శ్రీనివాసులు, మందలపు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజల్లో ఆనందం

- దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

ముండ్లమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని పసుపుగల్లులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి సోమవారం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. మూడున్నరేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆయా కుటుంబాలకు ఏయే పథకాలు అందాయో కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయడమే లక్ష్యంగా అందరం కలిసి పనిచెయ్యాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. తొలుత ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్‌కు ఘన స్వాగతం పలికారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, ఏఎంసీ చైర్మన్ వైవీ సుబ్బయ్య, డైరెక్టర్ అన్నపురెడ్డి భిక్షాల్‌రెడ్డి, జేసీఎస్ మండల కో ఆర్డినేటర్ మేడికొండ జయంతి, సొసైటీ చైర్మన్ కుమ్మిత వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బిజ్జం సుబ్బారెడ్డి, గర్నేపూడి ప్రసన్నకుమార్, జాన్, అంబటి వెంకటేశ్వరరెడ్డి, భద్రి సుబ్బారెడ్డి, దుగ్గినేని వెంకట్, బరిగే శ్రీను, సర్పంచిలు వరగాని బాల సుందర్‌రావు, జనుమాల నాగేంద్ర పిచ్చయ్య, చొప్పరపు వెంకటేశ్వర్లు, వేముల పద్మావతి శ్రీనివాసరావు, కందిమళ్ల గీతాంజలి, వంగల పద్మావతి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు దాసరి పెద అంజయ్య పాల్గొన్నారు.

మహిళకు ఎమ్మెల్యే మద్దిశెట్టి ఆర్థిక సాయం



జయసింహారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: అనారోగ్యంతో బాధపడుతున్న దొనకొండ మండలం గుట్టమీదపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు డేవిడ్ రిటామేరీకి వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ రూ.50 వేల ఆర్థిక సాయం చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఆమె ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం లంకోజనపల్లి రోడ్డులో రోడ్డు ప్రమాదానికి గురైన వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి పాశం జయసింహారావును పరామర్శించారు. వారి ఆరోగ్యం గురించి, ప్రమాదానిక కారణాలు అడిగి తెలుసుకున్నారు.

ప్లాస్టిక్ ఫ్లెక్సీలు నిషేధించాలి

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ నిబంధనల మేరకు పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ ఫ్లెక్సీలను నిషేధించాలని నగర పంచాయతీ కమిషనర్ వై.రామక్రిష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లెక్సీలతో పాటుగా ప్లాస్టిక్ కవర్ల వాడకాలను సైతం నిషేధిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ అమ్మకాలు నిర్వహించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పుల్లలచెరువు: గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జెడ్పీటీసీ వాగ్యానాయక్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లాజర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అవసరమైన మేరకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయాల పరిధిలోని ప్రజలు పౌర సేవలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఎంపీపీ లాజర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల్లు అర్హులకు అందేలా చూడాలన్నారు. ఏఓ సుధీర్‌బాబు మాట్లాడుతూ.. గ్రామాల్లో రబీలో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకునేలా చూడాలన్నారు. కొందరు ఎంపీటీసీలు గతంలో గ్రామాల్లో నీరు సరఫరా చేసిన ట్యాంకర్లకు బిల్లులు రాలేదని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. మండల సర్వసభ్య సమావేశాలకు మండల స్థాయి అధికారులు తమ కింది స్థాయి సిబ్బందిని పంపితే ఇబ్బంది పడతారని హెచ్చరించారు. సమావేశంలో పశువైద్యాధికారి నాగూల్‌మీరా, ఎంఈవో శామ్యూల్‌జాన్, విద్యుత్ ఏఈ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ కోట్ల రవణమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పాదయాత్ర పేరుతో పచ్చ నేతల రచ్చ

- హైవేపై ట్రాఫిక్ స్తంభించడంతో ప్రజల అవస్థలు



హైవేపై ట్రాఫిక్‌ను నిలిపేసిన టీడీపీ కార్యకర్తలు

త్రిపురాంతకం: పాదయాత్ర పేరుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేసిన రచ్చ ప్రజలను తీవ్ర ఇబ్బందులపాలు చేసింది. సోమవారం త్రిపురాంతకంలోని బ్రహ్మంగారి కాలనీ నుంచి బాలాత్రిపురసుందరీదేవి ఆలయం వరకు యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. అనంతపురం-అమరావతి హైవేపై కార్లు, బైకులతోపాటు డీజే బాక్సులతో పచ్చ నేతలు చేసిన హడావుడితో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. సాయంత్రం సమయం కావడంతో రద్దీగా ఉన్న రోడ్లపై పాదచారులు సైతం ఇబ్బంది పడ్డారు. జీఓ-1ను ఉల్లంఘించారంటూ మంత్రులు, వైఎస్సార్ సీపీ శ్రేణులపై తప్పుడు ప్రచారం చేస్తున్న పచ్చ పత్రికలు.. త్రిపురాంతకంలో టీడీపీ నేతల వ్యవహారశైలిని ఎలా చూపిస్తాయోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

- డీఎస్పీ కిశోర్‌కుమార్, ఆర్టీవో అమర్‌నాయక్



ర్యాలీకి హాజరైన డీఎస్పీ కిశోర్‌కుమార్, ఆర్టీవో అమర్‌నాయక్

మార్కాపురం: ప్రమాదాల నివారణ అందరి బాధ్యతని డీఎస్పీ డాక్టర్ ఎం.కిశోర్‌కుమార్, మార్కాపురం ఆర్టీవో అమర్‌నాయక్ అన్నారు. ఈ నెల 18 నుంచి 24 వరకు జరుగుతున్న రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల నుంచి కాలేజీ రోడ్డు, పాత బస్టాండ్, కోర్టు సెంటర్ మీదుగా పూలసుబ్బయ్య కాలనీ వరకు హెల్మెట్‌లు ధరించి మోటర్ సైకిళ్లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మద్యం తాగి వాహనంలు నడపవద్దని, ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని, ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి డ్రైవింగ్ చేయాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదాలకు కారణమన్నారు. ముందు వెళ్తున్న వాహనాలు ఓవర్‌టేక్ చేయవద్దని తెలిపారు. బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు, రూరల్ ఎస్ఐ సుమన్ పాల్గొన్నారు.

మార్కాపురం తహసీల్దార్‌గా కిరణ్‌కుమార్

మార్కాపురం టౌన్: మార్కాపురం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వి.కిరణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన బి.శ్రీనివాసరావు పదోన్నతిపై పోలవరం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. త్రిపురాంతకం తహసీల్దార్‌గా పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌ను మార్కాపురం ఇన్‌చార్జిగా నియమించారు.

అన్నదాన సత్రం నిర్మాణం అభినందనీయం



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కేపీ

కొనకనమిట్ల: భక్తుల సౌకార్యర్థం ప్రముఖ పుణ్యక్షేత్రం వెలుగొండస్వామి దేవస్థానంలో అన్నదాన సత్రం ఏర్పాటు చేయటం అభినందనీయమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. వెలుగొండ స్వామి అన్నదాన సత్రం కమిటీ నిర్వాహకులు మార్కాపురం పట్టణానికి చెందిన అంబడిపూడి బాలచెన్నయ్య, వంశీ, కట్టా చెన్నయ్య, బాలకృష్ణ, టి.విజయలక్ష్మి, ఎస్.భువనచంద్ర, వేము వెంకటేశ్వర్లు, దాసరి లక్ష్మమ్మ, జిడుగు రంగయ్యల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేపీ సోమవారం భూమి పూజ చేశారు. దేవస్థానం చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను దూషించిన వారిని అరెస్టు చేయాలి

మార్కాపురం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను దూషించిన రాయలసీమ యూనివర్సిటీ ఉద్యోగులపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని బీఎస్పీ అధ్యక్షుడు సంద్రపాటి కాలేబు కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. దారివేముల బాబీ, ఉత్తమ్‌కుమార్, బుదాల సతీష్, చెన్నకేశవులు, గురవయ్య, కిశోర్, శైలేష్, సురేష్ పాల్గొన్నారు.

మాదిగల సంక్షేమానికి కృషి

మార్కాపురం టౌన్: రాష్ట్రంలో మాదిగల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి కవలకుంట్ల దయాకర్ మాదిగ అధ్యక్షతన జిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి రంగం ద్వారానే మాదిగల అభ్యున్నతి సాధ్యమని, దీని కోసం ఎమ్మార్పీఎస్ తరఫున పోరాటం చేస్తామన్నారు. పలు సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తున్నామని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు టి.విజయ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి కె.రంగయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

దర్శి: స్థానిక ఎంవీఐ కార్యాలయంలో 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రముఖ హోమియో వైద్యులు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ఎం బాషా, వైద్యులు సుమన్, గీతాపద్మలు 115 మంది డ్రైవర్‌లకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో ఎంవీఐ రవికుమార్ మాట్లాడుతూ ప్రమాదాలు లేని ప్రయాణం లక్ష్యంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కళాకారులకు అంతర్జాతీయ అవార్డులు



అవార్డు గ్రహీతలతో అతిథులు

గిద్దలూరు రూరల్/కంభం: కోనసీమ చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఈ నెల 22వ తేదీ నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో గిద్దలూరుకు చెందిన బట్టి చంద్రశేఖర్‌కు అంతర్జాతీయస్థాయి అవార్డు దక్కింది. గిద్దలూరులోని శేఖర్ ఆర్ట్స్ నిర్వాహకుడైన చంద్రశేఖర్ వేసిన రెండు చిత్రాలకు మంచి గుర్తింపు వచ్చి అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రశంసించారు. అవే పోటీల్లో పాల్గొన్న కంభం పట్టణానికి చెందిన ముగ్గురు కళాకారులు వేసిన చిత్రాలకు అవార్డులు దక్కాయి. చిత్రకారులు పఠాన్ ఖాసింకు ఆర్ట్ లెజెండ్ అవార్డు, రాజుకు స్వర్ణ వర్ణ ఇంటర్నేషనల్ అవార్డు, ఇ.వెంకట్‌కు కేసీపీ అవార్డు దక్కింది. అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ సత్యశైలజాభరత, రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ ముఖ్య అతిథులుగా హాజరై అవార్డులు ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలను పలువురు అభినందించారు.

పొతకమూరు పాఠశాల ఆకస్మిక తనిఖీ

దర్శి: మండలంలోని పోతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈఓ అనితారోజ్‌రాణి సోమవారం అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల నోట్సులు, టీచర్ డైరీ, టీచింగ్ నోట్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో వసతులు, తరగతి గదులు పరిశీలించారు. నోట్సులు చక్కగా దిద్దాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులను డిప్యూటీ డీఈఓ ఆదేశించారు. అనంతరం పాఠశాల పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

చోరీ ఘటనలో ఆధారాల సేకరణ

దొనకొండ: స్థానిక బేతేలుపురంలో ఓ ఇంట్లో దొంగలు ప్రవేశించి సుమారు రూ.3 లక్షల నగదు, కొంత మేర బంగారం దోచుకున్న సంఘటన తెలిసిందే. బాధితుడు కరుణాకర్ ఫిర్యాదు మేరకు సోమవారం ఒంగోలు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ ఎస్ఐ టి.శరత్‌బాబు సమక్షంలో వేలి ముద్రలు సేకరించింది. సంఘటన స్థలాన్ని త్రిపురాంతకం సీఐ రాంబాబు పరిశీలించి పోలీస్ సిబ్బందికి సూచనలిచ్చారు.

గణపతికి వెండి కవచం బహూకరణ



వెండి కవచాన్ని ఈఓకు అందజేస్తున్న భక్తులు

త్రిపురాంతకం: త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో గణపతికి భక్తులు రెండున్నర కేజీల వెండి కవచాన్ని బహూకరించారు. త్రిపురాంతకానికి చెందిన ఎం.కోటయ్య, సుబ్బమ్మ, శ్రీనివాస్, కృష్ణకుమారి, దూపాటి విశ్వనాథశాస్త్రి, కిరణ్మయి రూ.2 లక్షల విలువైన వెండి కవచాన్ని ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ పద్మజ మల్లికార్జున్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పెద్దదోర్నాల: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని రేంజి అధికారి విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. నేచర్ క్యాంపు సందర్భంగా సోమవారం మండల పరిధిలోని తుమ్మలబైలు సమీపంలోని జంగిల్ సఫారీలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు వీర్లకొండలో ట్రెక్కింగ్ చేశారు. అనంతరం జంగిల్ సఫారీలోని పర్యావరణ విజ్ఞాన కేంద్రం విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పెద్దబొమ్మలాపురం, చెన్నారెడ్డిపల్లె జెడ్పీ స్కూళ్ల విద్యార్థులు పాల్గొన్నారు.

కారు-ఆటో ఢీ.. వ్యక్తికి గాయాలు

పొదిలి రూరల్: కారు-ఆటో ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన పట్టణంలోని పెద్ద మసీదు వద్ద ఒంగోలు-కర్నూలు రహదారిపై సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పొదిలి మండలం మల్లవరం గ్రామానికి చెందిన బూచిరాజు వెంకట్రావు తన ఆటోలో ప్రయాణికులను బస్టాండ్ వద్ద దింపి మల్లవరం వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఒంగోలు వైపు నుంచి వస్తున్న కారు మసీదు వద్ద ఆటోను ఢీకొట్టింది. ఆటో ముందు భాగం దెబ్బతింది. ఆటో డ్రైవర్ వెంకట్రావు శరీరానికి, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆస్పత్రిలో చేర్చగా ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైనా వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు.

చింతలగూడెంలో గందరగోళం!

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చింతల గూడెంలో మహిళలపై సెబ్ అధికారులు దాడి చేశారనే వీడియోలు సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీనిపై సెబ్ సీఐ రాగమయిని వివరణ కోరగా.. గూడేనికి చెందిన కుడుముల మూగెన్న నాటుసారా విక్రయిస్తున్నట్లు తమ విచారణలో తేలడంతో ఈ నెల 5న అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అయితే నిందితుడి కుమార్తె అంజమ్మ, కుడుముల నాని తమను అడ్డుకున్నారన్నారు. ఈ క్రమంలో సెబ్ ఎస్సై చేయిని అంజమ్మ కొరకడంతో విడిపించుకునే యత్నంలో ఆమె పడిపోయిందని సీఐ పేర్కొన్నారు.

కాకర్లలో చోరీ

అర్ధవీడు (కంభం): తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి బంగారు నగలు, నగదు అపహరించుకెళ్లిన సంఘటన మండలంలోని కాకర్ల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గన్నా చిన్నకోటయ్య ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి వెనుక వైపు నిద్రిస్తుండగా తాళం పగలగొట్టిన దొంగలు ఇంట్లోని డ్రెస్సింగ్ టేబుల్‌లో ఉంచిన మూడున్నర తులాల బంగారు సరుదు, రూ.5 వేల నగదు అపహరించుకెళ్లారు. సోమవారం ఉదయం గమనించిన యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బస్సు-లారీ ఢీ

కురిచేడు (దర్శి టౌన్): తెలంగాణ రాష్ట్రం కామారెడ్డికి చెందిన ఆర్టీసీ బస్సు.. క్యారెట్ లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొట్టు కోవడంతో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం రాత్రి కురిచేడు-వినుకొండ ఆర్అండ్‌బీ రోడ్‌లో వెంగాయపాలెం వద్ద జరిగింది. బస్సులో గాయపడిన ప్రయాణికులను దించి ప్రాథమిక చికిత్స చేయించి డ్రైవర్ సిరిసిల్ల స్వామి కురిచేడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బస్సు అద్దాలు కూడా ధ్వంసమయ్యాయి.